చూసేయ్ జాగా.. వేసేయ్ పాగా..!


చెరువు ఆక్రమణల్లో నిర్మాణాలు

- బొద్దాంలో సాగునీటి చెరువు కబ్జా
- ఇతర ప్రాంతాల వ్యాపారులకు విక్రయాలు
- మాయమవుతున్న చెరువు


ఆక్రమణలతో విస్తీర్ణం తగ్గిన బండివాని చెరువు

రాజాం: మండలంలోని పలు గ్రామాల్లో సాగునీటి చెరువులు ఆక్రమణలకు గురౌతున్నాయి. ప్రధాన రహదారుల పక్కన ఉన్న చెరువులు పూర్తిగా మాయమౌతున్నాయి. రెవెన్యూ, ఎలక్ట్రికల్ శాఖల సిబ్బంది ఒకటిగా మారి ఈ ఆక్రమణలకు తలుపులు తెరుస్తున్నారు. చెరువులు ఆక్రమణలకు గురవుతున్నా చూసీ చూడనట్లు రెవెన్యూ శాఖ వదిలేయగా, ఎటువంటి అనుమతులు లేకపోయినా అక్కడ ఆక్రమణల్లో ఉన్న షాపులకు, బడ్డీలకు ఎలక్ట్రికల్ సిబ్బంది విద్యుత్ మీటర్లు అందిస్తున్నారు. అనంతరం ఆక్రమణదారులు వీటిని పలువురు వ్యాపారులకు లక్షల్లో విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. ప్రతీచోట ఈ పరిస్థితి ప్రస్తుతం సాదాసీదాగా మారిపోయింది. ఇదిలా ఉండగా ఆయకట్టుకు ప్రధాన ఆదారమైన సాగునీటి చెరువులను కూడా ఇలానే కబ్జా చేస్తున్నారు. రైతులు అడ్డుకుంటున్న ఆక్రమణలు ఆగకపోవడం శోచనీయం. ఇటువంటి ఘటనే ఇప్పుడు మండలంలో బొద్దాం గ్రామంలో చోటు చేసుకుంది.


ఆక్రమణలు పరిశీలిస్తున్న పంచాయతీ వీఆర్ఓ, కార్యదర్శి తదితరులు

నాలుగెకరాల్లో... 40 సెంట్లే మిగిలింది

బొద్దాం గ్రామంలో రాజాం – చీపురుపల్లి ప్రధాన రహదారిని ఆనుకుని కొఠారిపురం వెళ్లే రూట్‌లో బండివాని చెరువు గతంలో విశాలంగా ఉండేది. గతేడాది కాలంగా ఈ చెరువులో ఆక్రమణలు అధికమయ్యాయి. 258–1 సర్వే నంబర్‌లోని 4.13 ఎకరాల విస్తీర్ణంతో చెరువు ఉండేది. ఈ చెరువు ఆయకట్టులో బొద్దాం, పెనుబాక, కొఠారిపురం గ్రామాలకు చెందిన 400 ఎకరాల ఆయకట్టు పంట పొలాలు ఉన్నాయి. ఆక్రమణల్లో చిక్కుకున్న చెరువు ప్రస్తుతం కుదించుకుపోయింది. ప్రస్తుతం 40 సెంట్లు కంటే ఎక్కువలేని పరిస్థతిలో ఈ చెరువు కనిపిస్తుంది. ఇంత పెద్ద చెరువు ఆక్రమణకు గురౌతున్నా ఎవరూ పట్టించుకోకపోవడం శోచనీయం. ఇప్పుడు చెరువు ఆయకట్టుకు చుక్క నీరు కూడా అందక రైతులు లబోదిబోమంటున్నారు.

చూసీ.. చూడనట్టు...

బండివాని చెరువులో ఆక్రమణలు రెవెన్యూ, పంచాయతీ అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తున్నారు. దీంతో ఆక్రమణదారులు చెరువులో మట్టి వేసి, చదునుచేసి తొలుత బడ్డీలు పెడుతున్నారు. అనంతరం పక్కా షాపులు నిర్మించి ఇతర ప్రాంతాల వారికి అద్దెకు ఇవ్వడం, రూ.లక్షల్లో ధర కట్టి విక్రయించడం చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఇటీవల మరికొంతమంది ఆక్రమణలకు పాల్పడడం, అందులో ఇతర ప్రాంతాల ఆక్రమణదారులు ఉండడంతో వివాదం తెరపైకి వచ్చింది. ఆక్రమణలను రైతులు, గ్రామస్తులు అడ్డుకోవడంతో సోమవారం వీఆర్‌ఓ రమణమ్మ, పంచాయతీ కార్యదర్శి రామచంద్రరావు తదితరులు వెళ్లి ఆక్రమణలు అడ్డుకున్నారు. ఇంతవరకూ చెరువు ఆక్రమణల్లో ఉన్నవారికి ఒక్క నోటీసు కూడా ఇవ్వకపోవడం, వాల్టా యాక్ట్‌ను ఆశ్రయించకపోవడంతోనే ఈ సమస్య వచ్చిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చెరువులో ఆక్రమణలు తొలగించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.


ఇలా మట్టిపోసి షాపుల నిర్మాణం

ఆక్రమణలు తొలగిస్తాం

బొద్దాం గ్రామంలో బండివాని చెరువు ఆక్రమణలు మా దృష్టికి ఇంతవరకూ రాలేదు. సంబంధిత చెరువు ఆక్రమణలపై ఆరా తీయడంతో పాటు సంబంధిత వీఆర్‌ఓ, సర్వేయర్లను అప్రమత్తం చేస్తాం. ఆక్రమణలపై చట్టపరంగా చర్యలు తీసుకుని తొలగిస్తాం.
– ఎస్‌కే రాజు, తహసీల్దార్, రాజాం

ఓపీ కోసం బారులు



రాజాం ఏరియా ఆస్పత్రి వద్ద దివ్యాంగుల కుటుంబీకులు తిప్పలు పడుతున్నారు. ప్రతీ రోజు సగటున వంద మందికి ఇక్కడ సదరం రీ వెరిఫికేషన్ నిర్వహిస్తున్నారు. ఆర్థో, ఐ విభాగానికి సంబంధించి దివ్యాంగులకు పునఃపరీక్షలు నిర్వహిస్తున్నారు. వీటి కోసం వచ్చే దివ్యాంగులు ముందుగా ఓపీలు తీసుకోవాలి. ఉదయం 11 గంటల వరకు ఓపీ టోకెన్లు సిబ్బంది ఇవ్వకపోవడంతో క్యూ లైన్లలో తోపులాటలు చోటు చేసుకుంటున్నాయి. ఉన్నతాధికారులు ఈ సమస్యకు చెక్ పెట్టాలని కోరుతున్నారు.
– రాజాం

ఓడీఎస్ ప్లస్ నిర్వహణపై నివేదికలివ్వండి



బొబ్బిలి నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో చేపట్టిన ఓడీఎస్ ప్లస్ కార్యక్రమాల నిర్వహణపై సమగ్ర నివేదికలు ఇవ్వాలని ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ ఢిల్లీశ్వరరావు ఆదేశించారు. స్థానిక ఆర్‌డబ్ల్యూఎస్ కార్యాలయంలో బొబ్బిలి, బాడంగి, రామభద్రపురం, తెర్లాం మండలాల స్వచ్ఛభారత్ సమన్వయకర్తలతో మంగళవారం ఆయన సమావేశం నిర్వహించారు. గ్రామాల్లో మరుగుదొడ్ల వినియోగం, పారిశుధ్య నిర్వహణ, చెత్త సంపద కేంద్రాల నుంచి సేంద్రియ ఎరువుల తయారీ వంటివి జరిగిన పంచాయతీలను ఓడీఎఫ్ ప్లస్‌గా గుర్తించామని తెలిపారు. సమావేశంలో జేఈ శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.
– బొబ్బిలి రూరల్

దరఖాస్తుల ఆహ్వానం

రేగిడి: మండలంలోని ఉంగరాడ మెట్ట వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో వచ్చే విద్యా సంవత్సరానికి సంబంధించి ఐదో తరగతి, ఇంటర్‌లో చేరేందుకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. మార్చి 6వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఐదో తరగతి ప్రవేశ పరీక్ష ఏప్రిల్ 6న ఉదయం 10 గంటలకు, ఇంటర్మీడియట్‌కు సంబంధించి అదే రోజు మధ్యాహ్నం 2 గంటలకు ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు.

క్లుప్తంగా

పోలమ్మతల్లికి ప్రత్యేక పూజలు


పోలమ్మతల్లికి పూజలు

బాడంగి: మండల కేంద్రంలో వెలసిన పోలమ్మతల్లికి మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకున్నారు. శంబర పోలమాంబ మారు జాతర జరుగుతున్న క్రమంలో అక్కడికి వెళ్లలేని భక్తులు అదే పేరుతో పిలవబడుతున్న బాడంగి పోలమ్మతల్లిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటున్నారు.

ఉపాధి పనుల వద్ద ఎఫ్ఏలు ఉండాలి


వేతనదారులకు సూచనలిస్తున్న ఏపీఓ

రేగిడి: గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనుల వద్ద ఫీల్డ్ అసిస్టెంట్‌లు తప్పనిసరిగా ఉండాలని ఏపీఓ ఎస్.హరనాథరావు సూచించారు. మండలంలో ఆమదాలవలస, గుళ్లపాడు, వావిలవలస తదితర గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేయాలని వేతనదారులకు సూచించారు.

వేడుకగా ఉమారామలింగేశ్వర స్వామి కల్యాణం


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

రాజాం: పట్టణంలో కూరాకుల వీధిలోని ఉమారామలింగేశ్వర స్వామి కల్యాణం మంగళవారం వైభవంగా నిర్వహించారు. దేవదాయ ధర్మాదాయ శాఖ పర్యవేక్షణలో ఈ ఉత్సవం జరిపారు. ఆలయ అర్చకులు మణికి హరగోపాలశర్మ, మణికి శివన్నారాయణమూర్తి శర్మల ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి


రికార్డులు తనిఖీ చేస్తున్న జిల్లా గ్రంథాలయ శాఖ కార్యదర్శి లక్ష్మి

రామభద్రపురం: జిల్లాలోని గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు జిల్లా గ్రంథాలయ శాఖ కార్యదర్శి బి.లక్ష్మి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయాన్ని మంగళవారం ఆమె సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. రోజూవారీ గ్రంథాలయానికి ఎంత మంది పాఠకులు వస్తున్నారు, పాఠకులకు సరిపడ పుస్తకాలు ఉన్నాయా లేదా అని లైబ్రేరియన్ సత్యవాణిని అడిగి తెలుసుకున్నారు. ఏఏ పుస్తకాలు అవసరమో వాటి కోసం ఇండెంట్ పెట్టాలని సూచించారు.

విద్యార్థులకు అభినందన


విద్యార్థులతో పాఠశాల సిబ్బంది

బొబ్బిలి: అంతరిక్షంలో మానవ జీవితానికి మద్దతు అన్న అంశంపై స్థానిక నారాయణ ఈ టెక్నో స్కూల్ విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్టు ఉత్తమ ప్రాజెక్టుగా ఎంపికై నట్టు ఏజీఎం శివరాం తెలిపారు. పాఠశాలలో 7, 8, 9 తరగతులు చదువుతున్న లోహిత్, లేఖ్యశ్రీ,లక్ష్మీ శ్రీనివాస్, చందన, నిత్యశ్రీ,హర్షిణి, లక్ష్మీ నారాయణ ఈ ప్రాజెక్టును తయారు చేశారన్నారు. ఈ సందర్భంగా డీజీఎం హనుమంతరావు, ఆర్ఐ రాజేష్, కోఆర్డినేటర్ జయ వెంకట్, హెచ్ఎం త్రినాధ్ విద్యార్థులను అభినందించారు.

గోకులాలను త్వరగా పూర్తి చేయాలి


గోకుల షెడ్‌ను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

బాడంగి: మండలంలో ఇప్పటికీ పూర్తికాని గోకులాల షెడ్ల పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ ఎస్.రామకృష్ణ సూచించారు. గోకుల షెడ్లను ఆయన మంగళవారం పరిశీలించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారం రోజుల్లో వీటి నిర్మాణాలు పూర్తి చేయాలని సూచించారు. ఆయన వెంట టెక్నికల్ సహాయకురాలు మానస, లబ్ధిదారులు ఉన్నారు.

• పరామర్శ


లోకేష్ కుటుంబాన్ని పరామర్శిస్తున్న తలే రాజేష్ తదితరులు

సంతకవిటి: మండలంలోని తలతంపర గ్రామంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త పోలాకి లోకేష్ అమ్మమ్మ ఖండ్యాపు అప్పల నరసమ్మ, అదే గ్రామానికి చెందిన వార్డు మెంబర్ పోలాకి బృందావతి భర్త విష్ణుమూర్తి ఇటీవల మరణించిన విషయం తెలుసుకుని రాజాం నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్, జెడ్పీ వైస్‌చైర్మన్ సిరిపురపు జగన్‌మోహన్‌రావు మంగళవారం గ్రామానికి చేరుకుని వారి కుటుంబాలను పరామర్శించారు. వారి వెంట వంగర ఎంపీపీ సురేష్ ముఖర్జీ, రాజాం మండలం రూరల్ కన్వీనర్ లావేటి రాజగోపాల్‌నాయుడు, రాజాం జెడ్పీటీసీ బండి నర్సింహులు, చింతలపాటి వెంకటపతిరాజు, లంకవలస రాంబాబు, సర్పంచ్‌లు పప్పల గణపతి, కెంబూరు వెంకటప్పలనాయుడు, పొగిరి లెనిన్‌బాబు, బొక్కేల వెంకటప్పలనాయుడు, బూరాడ వెంకటరావు, బొత్స ప్రవీణ్, జిల్లా ఐటీ వింగ్ అధ్యక్షుడు గంధవరపు హేమంత్, పొగిరి సత్యంనాయుడు తదితరులు ఉన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారమే లక్ష్యం : ఆర్డీఓ


మాట్లాడుతున్న ఆర్డీఓ రామ్మోహనరావు

రామభద్రపురం: రెవెన్యూ సమస్యల పరిష్కారమే లక్ష్యమని ఆర్డీఓ రామ్మోహనరావు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. రెవెన్యూ సమస్యలకు సంబంధించిన సమస్యలపై తహసీల్దార్ సులోచనరాణిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 అక్టోబర్ 15 ముందు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని నివాసాలు నిరించుకున్నట్లయితే ప్రభుత్వం వెసులబాటు జీఓ జారీ చేసిందన్నారు. 150 గజాలు ఆక్రమించుకున్న వారు దరఖాస్తు చేసుకుంటే ఉచితంగా పట్టా ఇస్తుందన్నారు. అలాగే 151 నుంచి 300 గజాలకు ప్రభుత్వ ధరలో 15 శాతం, 301 నుంచి 450 గజాలకు 50 శాతం చెల్లించాలన్నారు. 450 గజాలకు 5 రెట్లు లబ్ధిదారులు చెల్లిస్తే ప్రభుత్వం పట్టా ఇస్తుందని చెప్పారు. గత ఏడాది అక్టోబరు, నవబంరులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులలో భూ సమస్యలకు సంబంధించి 11,916 వినతులు వచ్చాయని అందులో 10,748 సమస్యలు పరిష్కారమయ్యాయని తెలిపారు. 1163 సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటికి సమయం పడుతుందని తెలిపారు.

పల్లె పండగ పనులు సకాలంలో పూర్తి చేయాలి


వెలగవలసలో సీసీ రోడ్డు పనులు పరిశీలిస్తున్న పీఆర్ ఈఈ రమణమూర్తి

తెర్లాం: బొబ్బిలి డివిజన్‌లో మూడు నియోజకవర్గాల్లోని గ్రామాలకు మంజూరైన పల్లెపండగ పనులను సకాలంలో పూర్తి చేయాలని పీఆర్ ఈఈ టీవీ రమణమూర్తి అన్నారు. మండలంలోని వెలగవలస, పెరుమాళి గ్రామాల్లో సీసీ రోడ్లు పరిశీలించేందుకు మంగళవారం ఆయన విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరిగిన పనులను పరిశీలించి, పనులకు సంబంధించిన వివరాలను మండల ఇంజనీరింగ్ అధికారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బొబ్బిలి డివిజన్‌లో రూ.75కోట్లతో 1048 పనులు మంజూరయ్యాయని చెప్పారు. వీటిలో ఇంతవరకు 640 పనులు పూర్తయ్యాయని, మిగిలినవి వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నాయని తెలిపారు. ఇంతవరకు జరిగిన పనులకు సంబంధించి రూ.10కోట్లు మేరకు బిల్లుల చెల్లింపులు జరిగాయని, ఇంకా రూ.25కోట్లపైనే బిల్లులు చెల్లించాల్సి ఉందని చెప్పారు. పల్లెపండగ కార్యక్రమంలో మంజూరైన పనులు సకాలంలో పూర్తి చేయాలని ఆయన సూచించారు.

విభిన్న ప్రతిభావంతుల వివరాలు అందజేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి కె.శారదాంబ

• సీనియర్ సివిల్ జడ్జి కె.శారదాంబ

రాజాం సిటీ: రాజాం నియోజకవర్గంలో విభిన్న ప్రతిభావంతుల వివరాలను ఆయా తల్లిదండ్రులు సర్వే బృంద సభ్యులకు అందజేయాలని మండల న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, సీనియర్ సివిల్ జడ్జి కె.శారదాంబ అన్నారు. మంగళవారం స్థానిక కోర్టు సముదాయంలో న్యాయవాదులు, పారా లీగల్ వలంటీర్లు, వైద్యారోగ్యశాఖ, ఐసీడీఎస్ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులను గుర్తించి వారి వివరాలు సేకరించడంలో ఈ నెల 24 వరకు రాజాం, రేగిడి, వంగర, సంతకవిటి మండలాల్లో మూడు బృందాలతో డోర్ టు డోర్ సర్వే జరుగుతుందన్నారు. ఈ సర్వేకు ప్రోగ్రాం ఆఫీసర్‌గా వీవీబీ సుబ్రహ్మణ్యం వ్యవహరించనున్నారని తెలిపారు. జూనియర్ సివిల్ జడ్జి పీఎస్ వీబీ కృష్ణసాయితేజ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

జేఈఈ మెయిన్స్‌లో డోలపేట విద్యార్థి ప్రతిభ


పాలవలస పవన్‌తేజ ఓలేటి దినేష్‌కుమార్

రాజాం సిటీ: పట్టణ పరిధి డోలపేట గ్రామానికి చెందిన పాలవలస పవన్‌తేజ మంగళవారం విడుదలైన జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో 99.60 పర్సంటైల్‌తో చక్కని ప్రతిభ కనబరిచాడు. బిలాస్‌పూర్‌లో పదో తరగతి చదివి 477 మార్కులు, వైజాగ్‌లోని ఓ ప్రైవేటు కళాశాల ఇంటర్మీడియట్‌లో 445 మార్కులు సాధించాడు. పవన్‌తేజను తల్లిదండ్రులు భాస్కరరావు, స్వప్న కుమారి తదితరులు అభినందించారు. అలాగే రాజాంకు చెందిన ఓలేటి దినేష్‌కుమార్ 97.95 పర్సంటైల్ సాధించి చక్కని ప్రతిభ కనబరిచాడు. ఈయన ప్రతిభపట్ల తల్లిదండ్రులు ఓలేటి గణపతి, లక్ష్మిలతోపాటు బంధువులు హర్షం వ్యక్తం చేశారు.

విశిష్ట సంఖ్యతో బహుళ ప్రయోజనాలు

సంతకవిటి: ఆధార్ తరహాలోనే ప్రతి రైతుకు కూడా 11 అంకెలతో యునిక్ ఐడీ కేటాయించనున్నారని ఏఓ పైల నవీన్ అన్నారు. మంగళవారం బొద్దూరు రైతుభరోసా కేంద్రంలో రైతులతో సమావేశం నిర్వహించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాటు చేస్తున్న ప్రత్యేక కోడ్ యొక్క విశిష్టతను తెలిపారు.

రుణాలు సకాలంలో చెల్లించాలి

రేగిడి: బ్యాంకుల ద్వారా స్వయంశక్తి సంఘాల మహిళలు తీసుకున్న రుణాలు క్రమం తప్పకుండా చెల్లించాలని ఏపీఎం గోవిందరావు మహిళలకు సూచించారు. మండలంలోని ఆమదాలవలస, రేగిడి, రంగారాయపురం గ్రామాల్లో సంఘాల మహిళలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ మండలంలో 1815 స్వయంశక్తి సంఘాలు ఉండగా, వీటిలో 19,875 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారని వెల్లడించారు. వీఓఏలు, సీఎఫ్‌లు పాల్గొన్నారు.

గ్రామాల్లో ప్రచారం

మెంటాడ: మండలంలోని ఆంధ్ర, పిట్టాడ, మెంటాడ గ్రామాల్లో త్రైత సిద్ధాంత గ్రంథంపై హిందూ జ్ఞాన వేదిక, ప్రబోధ సేవా సమితి విజయనగరం కమిటీ ఆధ్వర్యంలో ఇంటింటా ప్రచారం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథంలోని సారాంశాన్ని గ్రామస్తులకు సేవా సమితి సభ్యులు వివరించారు. సేవా సంఘం జిల్లా కమిటీ అధ్యక్షుడు వానపల్లి శంకర్రావు సభ్యులు పాల్గొన్నారు.

బ్యాడ్ టచ్‌లపై అప్రమత్తంగా ఉండాలి

బొబ్బిలిరూరల్: విద్యార్థినిలు తమ చుట్టు ఉన్న ప్రపంచాన్ని నిశితంగా గమనించాలని, గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అప్రమత్తంగా ఉండాలని ఒన్‌స్టాప్ సెంటర్ ప్రతినిధి ఎల్.అనిత సూచించారు. మండలంలోని పారాది గ్రామ జెడ్పీ స్కూల్‌లోని విద్యార్థులకు గుడ్, బ్యాడ్ టచ్‌లపై మంగళవారం అవగాహన కల్పించారు. పాఠశాల హెచ్ఎం, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కట్టెల పొయ్యిపై వంటలు చేయొద్దు

రాజాం: మండలంలో బొద్దాం హైస్కూల్‌లో మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంఈఓ యాగాటి దుర్గారావు మంగళవారం పరిశీలించారు. మెనూ అమలుపై ఆరా తీశారు. కట్టెల పొయ్యిపై వంట చేయవద్దని, గ్యాస్ వినియోగించాలని నిర్వాహకులకు సూచించారు. భోజనం బాగా వండాలని అన్నారు. హెచ్ఎం గురుమూర్తి, ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతీ రైతు ప్రత్యేక విశిష్ట సంఖ్య కలిగి ఉండాలి

బాడంగి: మండలంలోని భూములు కలిగిన ప్రతీ ఒక్క రైతు ప్రత్యేక విశిష్ట సంఖ్యతో కూడిన గుర్తింపు కార్డులను కలిగి ఉండాలని ఏఓ కె.శిరీష కోరారు. మండలంలోని తెంటువలసలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మంగళవారం చేపట్టారు. ఈ సంఖ్య ద్వారా వ్యవసాయ సేవలను సులభంగా పారదర్శకంగా వేగంగా పొందవచ్చన్నారు. ఆమెతో పాటు ఆర్‌బీఎస్ సిబ్బంది జయలక్ష్మి, శరత్, మురళి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరం

రేగిడి: పాడి పశువులు వ్యాధుల బారిన పడకుండా రైతులు ఎప్పటికప్పుడు చూసుకోవాలని రేగిడి పశు వైద్యాధికారి దుర్గాప్రసాద్ సూచించారు. మజ్జిరాముడుపేట గ్రామంలో పాడి పశువుల వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. రైతులకు పాడి పరిశ్రమ అభివృద్ధిపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ నిర్మల, రైతులు పాల్గొన్నారు.

ప్రజాప్రతినిధులను అవమానపర్చడం దారుణం

రేగిడి: ప్రజాప్రతినిధులపై గజపతినగరం మండలం తహసీల్దార్ దురుసుగా ప్రవర్తించడం హేయనీయమైన చర్య అని రాజాం నియోజకవర్గ ఇంటిలెక్చువల్ ఫోరం అధ్యక్షుడు కెల్ల మన్మధరావు అన్నారు. మంగళవారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడారు. సర్పంచ్‌పై తహసీల్దార్ అనుచితంగా మాట్లాడడాన్ని తప్పుపడుతున్నామని ఆరోపించారు. తహసీల్దార్‌పై పరువునష్టం దావా వేయనున్నామని తెలిపారు.

మూలకు చేరిన ఆక్వా ఫిల్టర్

సంతకవిటి: మండల కేంద్రంలోని ఎంపీపీ పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్యకరమైన తాగు నీరు అందించే నిమిత్తం ఏర్పాటు చేసిన ఆక్వా ఫిల్టర్ మూలకు చేరింది. గత ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా వీటిని ఏర్పాటు చేసింది. గ్రీవెన్స్ పెట్టి ఆక్వా ఫిల్టర్ బాగు చేసేందుకు చర్యలు తీసుకుంటామని హెచ్ఎం వై.ఎలిజబెత్‌రాణి తెలిపారు.

నాణ్యమైన విద్యను అందించాలి

తెర్లాం: విద్యార్థులకు నాణ్యమైన విద్యను ఉపాధ్యాయులు అందించాలని ఎంఈఓలు త్రినాధరావు, పాపారావు అన్నారు. మండలంలోని ఎం.ఆర్.అగ్రహారం ప్రాథమిక పాఠశాలను మంగళవారం వారు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాలు, మరుగుదొడ్లు, తాగునీటి వనరులు, విద్యార్థుల హోంవర్కు పుస్తకాలు, చేతిరాత, అభ్యసనా సామర్థ్యాలను పరిశీలించారు. మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచాలని స్కావెంజర్స్‌కి సూచించారు.

కంటి ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి


కంటి రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ దివ్యభారతి

తెర్లాం: ప్రజలంతా కంటి ఆరోగ్యం పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని తెర్లాం పీహెచ్‌సీ డాక్టర్ దివ్యభారతి, పెరుమాళి పీహెచ్‌సీ ఆప్తాల్మిక్ అధికారి వసంతరావు అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో మంగళవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరానికి హాజరైన కంటి రోగులకు పీహెచ్‌సీ వైద్యురాలు తనిఖీ చేశారు. శిబిరానికి హాజరైన రోగుల్లో 19మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. సీహెచ్ఓ భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

హత్యకు పాల్పడిన వారిని శిక్షించాలి

బాడంగి: తెర్లాం మండలం నెమలాం–ఎస్.బూర్జివలస గ్రామాల మధ్య హత్యకు గురైన సాఫ్ట్‌వేర్ ఇంజనీరు కోనారి ప్రసాద్‌ను హత్య చేసిన హంతకులను వెంటనే పట్టుకొని కఠినంగా శిక్షించాలని ఎమ్మెల్యే బేబీనాయన బొబ్బిలి సీఐ నారాయణరావును కోరారు. ఆస్పత్రిలో ప్రసాద్ మృతదేహాన్ని చూసి సంతాపం వెలిబుచ్చారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

సంగాంలో ప్రసాదాల వేలం పాట

వంగర: మండల పరిధి సంగాంలో వెలసిన పవిత్ర సంగమేశ్వరస్వామి ఆలయం ఆవరణలో మహాశివరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మంగళవారం ప్రసాదాల వేలం పాట నిర్వహించారు. 80 గ్రాములు లడ్డూ ప్రసాదం రూ.15లు కాగా 150 గ్రాముల పులిహోర ప్రసాదం రూ.10లు విక్రయించాల్సి ఉంది. ఈ పాటను బొడ్రోతు పరమేష్‌నాయుడు రూ.97,500లకు దక్కించుకున్నట్లు ఈఓ పి.శ్యామలరావు వెల్లడించారు. కార్యక్రమంలో మరో ఈఓ బీవీ మాధవరావు, బొడ్రోతు శ్రీనివాసరావు, బోను ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.


ప్రసాదాల వేలం పాల నిర్వహిస్తున్న ఆలయ అధికారులు